# 51

# విశ్వాసుల కొరకైన దీవెనలు

## (యెషయా 54)

దీనికి ముందటి అధ్యాయంలో సర్వలోకమునకు సంబంధించిన సువర్తమానము గూర్చి ప్రకటించిన తరువాత, విమోచనము వలన కలుగు మహిమాన్వితమైన దీవెనలు 54వ అధ్యాయంలో చాటిచెప్పబడుచున్నవి. హెూమర్ హెయ్‌లీ ఇలా చెప్పుచున్నాడు,

> ఈ అధ్యాయము చెరలో నుండినవారు బబులోను నుండి తిరిగి వచ్చి ఇశ్రాయేలు దేశమును మరియు యెరూషలేము దేవాలయమును ఒక పట్టణము వలె భౌతికంగా మరలా నిర్మించుకొనుటకు సంబంధించిన ఒక ప్రవచనమని అర్థవివరణ చెప్పుటకు చేయబడిన సకల ప్రయత్నములు పరమ బలహీనమైనవిగా ఉన్నవి. విశేషంగా, సేవకుడు ఒక ఆధ్యాత్మిక జనాంగమును విమోచించిన బలియాగ కార్యము వలన కలిగిన మహిమాన్వితమైన ఫలితములు ఇక్కడ ఆలోచించబడుచున్న అంశమై యున్నది.[1]

### దేవుని ప్రజలు విస్తరించుట (54:1-3)

> గొడ్రాలా, పిల్లలు కననిదానా, జయగీతమెత్తుము
> ప్రసవవేదన పడనిదానా, జయకీర్తన నెత్తి ఆనంద పడుము
> సంసారిపిల్లలకంటె విడువబడినదాని పిల్లలు విస్తార మగుదురని
> యెహోవా సెలవిచ్చుచున్నాడు.
> నీ గుడారపు స్థలమును విశాలపరచుము
> నీ నివాసస్థలముల తెరలు నిరాటంకముగ సాగనిమ్ము,
> నీ త్రాళ్లను పొడుగుచేయుము
> నీ మేకులను దిగగొట్టుము.
> కుడివైపునకును ఎడమవైపునకును నీవు వ్యాపించెదవు
> నీ సంతానము అన్యజనముల దేశమును స్వాధీనపరచు కొనును
> పాడైన పట్టణములను నివాస స్థలములుగా చేయును.

పౌలు ఈ మొదటి వచనమును శారా మరియు హాగరుల రూపకాలంకారములో ఉపయోగించుట (గలతీయులకు 4:27) భౌతిక వాగ్దానము (ఆదికాండము 12:2) ప్రకారము పుట్టిన పిల్లల కంటే విశేషంగా, ఆధ్యాత్మిక వాగ్దానము (ఆదికాండము 12:3బి) చొప్పున జన్మించిన పిల్లల గూర్చి చెప్పుచున్నదని సూచించుచున్నది. ఇస్సాకు జన్మించునంత వరకు సంతానము లేకుండా ఉండిన స్త్రీ, శారాను గూర్చిన చిత్రము, మనకు సందర్భమును సమకూర్చుచున్నది (ఆదికాండము 18).[2] దేవుడు అబ్రాహాము మరియు శారాకు ఇచ్చిన వాగ్దానమును నిలబెట్టుకొనుటలో విశ్వసనీయమైనవాడుగా ఉండినట్లే, అబ్రాహాము యొక్క ఆధ్యాత్మిక సంతానమును విమోచించుటలో సహితము ఆయన విశ్వసనీయమైనవాడుగానే నిలిచియుండును. గనుక "జయగీతమెత్తుము" అని పిలుపుచ్చుచున్నది ఈ విశ్వసనీయతయే.

"గుడారము"ను గూర్చిన అలంకారము (వచనం 2) "ఈ లోకము మన స్థిరనివాసము కాదు" మనము జ్ఞాపకమునకు తెచ్చుకొనుటకు మనకు సహాయము చేయగలదు. మనము, అబ్రాహాము వలెనే, పరదేశులమై యున్నాము. మనము "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణము కొరకు కూడ ఎదురుచూచుచున్నవారమై" యున్నాము (హెబ్రీయులకు 11:10).

ఆధ్యాత్మిక ఇశ్రాయేలు "కుడివైపునకును ఎడమవైపునకును వ్యాపించి" "అన్యజనముల దేశమును స్వాధీనపరచుకొనవలసి" యుండినది (వచనం 3). పునరుత్థానుడైన యేసు ప్రభువు ఆరోహణుడై తండ్రి యొద్దకు వెళ్లక మునుపు తన శిష్యులతో పలికిన చివరి పలుకులు ఏమనగా, "మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను, భూదిగంతముల వరకును నాకు సాక్షులైయుందురు" (అపొస్తలుల కార్యములు 1:8బి). అంతకు మునుపు ఆయన, "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి; ఇదిగో, నేను యుగసమాప్తి వరకు, సదాకాలము మీతో కూడ ఉన్నాను" అని వారితో చెప్పియుండెను (మత్తయి 28:19, 20).

## మన విమోచకుని ప్రేమ (54:4–8)

భయపడకుము నీవు సిగ్గుపడనక్కరలేదు
అవమానమును తలంచకుము
నీవు లజ్జపడనక్కరలేదు, నీవు నీ బాల్యకాలపు
    సిగ్గును మరచుదువు
నీ వైధవ్యపు నిందను ఇక మీదట జ్ఞాపకము చేసికొనవు.
నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయైయున్నాడు
సైన్యములకధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు.
ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుడు నీకు విమోచకుడు
సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు.
నీ దేవుడు ఈ మాట సెలవిచ్చుచున్నాడు
–విడువబడి దుఃఖాక్రాంతురాలైన భార్యను పురుషుడు రప్పించినట్లును
తృణీకరింపబడిన యౌవనపు భార్యను పురుషుడు రప్పించినట్లును
యెహోవా నిన్ను పిలుచుచున్నాడు.
నిమిషమాత్రము నేను నిన్ను విసర్జించితిని
గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చెదను
మహోద్రేకము కలిగి నిమిషమాత్రము నీకు విముఖుడనైతిని
నిత్యమైన కృపతో నీకు వాత్సల్యము చూపుదును
అని నీ విమోచకుడగు యెహోవా సెలవిచ్చుచున్నాడు.

"అవమానము" మరియు "లజ్జ" అను పదములు "సిగ్గు"ను అనుభవించిన దానికి పర్యాయపదములై యున్నవి (వచనం 4). ఈ మాటలు విమోచింపబడని వారి దురవస్థ గూర్చి సంగ్రహముగా తెలుపుచున్నవి. ఏదిఏమైనా, ఈ విషయాలు విమోచింపబడినవారి

విషయములో గతించిన అంశములై యున్నవి.

ఆనందమునకు గల హేతువు ప్రభువునందు, అనగా "నిన్ను సృష్టించినవాడు," "నీకు భర్తయైనవాడు." "సైన్యములకధిపతియగు యెహోవా." "ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు," "విమోచకుడు," "సర్వలోకమునకు దేవుడు" అని పిలువబడుచున్నవాని యందున్నది (వచనం 5). ఇది విమోచింపబడినవారి భద్రత గూర్చిన ఎంత అద్భుతకరమైన ప్రకటన కదా! మనము మన స్వంత శక్తిపై గాని వనరులపై గాని ఆధారపడ నవసరము లేదు. "సర్వలోకమునకు దేవుడు" అయియున్నవాని వాగ్దానములు మనకున్నవి! విశ్వాసఘాతుకురాలైన భార్య యొక్క భర్తగా హోషేయ పొందుకొనిన అనుభవము దేవుడు ఇశ్రాయేలు యెడల కలిగియున్న ప్రేమ గూర్చి మనకు నేర్పించుచున్నది, మనము క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయై యున్నామని క్రైస్తవులమైన మనకు ఉద్బోధించుటకు పౌలు భార్యభర్తల సన్నిహిత సంబంధమునకు సంబంధించి సుందరమైన ఈ సాదృశ్యమును సద్వినియోగం చేసికొనుచున్నాడు (ఎఫెస్సీయులుక 5:22–33).

"తృణీకరింపబడిన యౌవనపు భార్య" (వచనం 6) గూర్చిన అలంకారమును దేవుడు విశ్వాసుల యెడల కలిగియున్న "వాత్సల్యము" మరియు "నిత్యమైన కృప"తో (వచనం 7, 8) పోల్చినప్పుడు ఈ లోకములో సంభవించు తృణీకారము మరియు అన్యాక్రాంతము ఎంతో సంక్షేపమైన ఉదహరణగా అర్థమగుచున్నది. నిత్యమైన కృప:[3] ఎంత ఆశ్చర్యకరమైన ఆలోచన కదా! ప్రవక్తయైన యిర్మీయా, విలాపవాక్యములు 3:22–24లో పలికిన మాటల ఆధారంగా రచింపబడిన ఒక చక్కని పాటను ఇది నాకు గుర్తుచేయుచున్నది. ఆ పాట ఏమంటే,

దేవుని యెడతెగని ప్రేమ ఎన్నటికినీ విరమించదు,
దివ్య కనికరములు ఎన్నటికినీ మాయముగావు;
అనుదినము అవి నూతనమౌను;
దేవా! నీ విశ్వాస్యత ఎంతో గొప్పది.
"యెహోవా నా భాగమని" నా ఆత్మ చెప్పుచున్నది,
"కాబట్టి నేనాయన యందు నమ్మికయుంచుదును."[4]

### సమాధాన ఒడంబడిక (54:9, 10)

నోవాహు కాలమున జలప్రళయమునుగూర్చి నేను
చేసినట్లు చేయుదును
జలములు భూమిమీదికి ఇకను పొర్లుచురావని
నోవాహు కాలమున నేను ఒట్టు పెట్టుకొనినట్లు
నీమీద కోపముగా నుండననియు నిన్ను గద్దింపననియు
నేను ఒట్టుపెట్టుకొనియున్నాను.
పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను
నా కృప నిన్ను విడిచిపోదు
సమాధానవిషయమైన నా నిబంధన తొలగిపోదు
అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు.

దేవుడు నోవాహుకిచ్చిన తన వాగ్దానమును నిలబెట్టుకొన్నట్లే (ఆదికాండము 8:21, 22),

ఆధ్యాత్మిక ఇశ్రాయేలుకు ఆయనిచ్చిన వాగ్దానము ప్రకారము ఆయన తన మాట తప్పడు (వచనాలు 9, 10). హోమర్ హెయ్‌లీ ఇలా చెప్పుచున్నాడు, "ఈ వాగ్దానము జాతీయ ఇశ్రాయేలునకు గాని భౌతిక యెరూషలేమునకు గాని ఇవ్వబడలేదు, ఏలయనగా చెర నుండి బయలుదేరి తిరిగి వచ్చినది మొదలుకొని రోమా సామ్రాజ్యాధికారుల చేత విధ్వంసము చేయబడువరకు కూడ బహిర్గతము చేయబడిన దేవుని అగ్రహమును ఈ రెండునూ అనుభవించాయి. విశేషంగా, వాగ్దానము ఆధ్యాత్మిక ఇశ్రాయేలుకు ఇవ్వబడినది."[5]

### నీతిమంతమైన పట్టణము (54:11–17)

"పట్టణ ఇతివృత్తము యెషయా సంబంధమైన సాహిత్యములో అవినాభావ భాగమైయున్నది" అని జే. అలెక్ మోటెయిర్ ధృవీకరించాడు. యెషయా గ్రంథం దావీదు పట్టణము (1:26–31), సమస్త జనముల పట్టణము (2:2–4), కడిగివేయబడిన పట్టణము (4:2–6), ఆనందమయమైన పట్టణము (12:1–6), బలమైన పట్టణము (26:1–4), విమోచింపబడిన పట్టణము (35:10), ఆదరణ పొందుకొనిన పట్టణము (66:10–13), మరియు నీతిగల పట్టణము (54:11–17) గూర్చి తెలియజెప్పుచున్నది.[6]

> ప్రయాసపడి గాలివానచేత కొట్టబడి ఆదరణలేక యున్నదానా,
> నేను నీలాంజనములతో నీ కట్టడమును కట్టుదును
> నీలములతో నీ పునాదులను వేయుదును
> మాణిక్యమణులతో నీ కోటకొమ్ములను
> సూర్యకాంతములతో నీ గుమ్మములను కట్టుదును
> ప్రశస్తమైన రత్నములతో నీకు సరిహద్దులు ఏర్పరచుదును.
> నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము నొందుదురు
> నీ పిల్లలకు అధిక విశ్రాంతి కలుగును.
> నీవు నీతిగలదానవై స్థాపింపబడుదువు
> నీవు భయపడనక్కరలేదు, బాధించువారు నీకు దూరముగా నుందురు
> భీతి నీకు దూరముగా ఉండును
> అది నీ దగ్గరకు రానేరాదు.
> జనులు గుంపుకూడినను వారు నావలన కూడరు
> నీకు విరోధముగా గుంపుకూడువారు నీ పక్షపు వారగుదురు.
> ఆలకించుము, నిప్పులూది తన వృత్తికి తగినట్టుగా పని
>     ముట్టు చేయు కమ్మరిని సృజించువాడను నేనే
> నాశనము చేయుటకై పాడుచేయువాని సృజించువాడను నేనే
> నీకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదు
> న్యాయవిమర్శలో నీకు దోషారోపణచేయు ప్రతి
>     వానికి నీవు నేరస్థాపన చేసెదవు
> యెహోవాయొక్క సేవకుల నీతి నావలన కలుగు
>     చున్నది; ఇది వారి స్వాస్థ్యము,
> ఇదే యెహోవా వాక్కు.

11 మరియు 12 వచనములను చదువువారు ప్రకటన గ్రంథం 21వ అధ్యాయంలో వ్రాయబడియున్నట్లు యోహాను చూచిన పరలోక యెరూషలేము దర్శనము గూర్చి

ఆలోచించవచ్చును. బబులోనువంటి ఇహమునకు సంబంధించిన పట్టణములు తన్మయత్వము కలిగించునట్టి అందమైనవే కానీ అవి తాత్కలికమైనవి. దేవుని పట్టణము మాత్రమే నిత్యమైనది.

ఆదర్శప్రాయమైన ఈ ఏర్పాటును వర్ణించుచున్న ప్రవక్త, "నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము నొందుదురు" అని తెలియజెప్పుచున్నాడు (వచనం 13). ప్రజలను దేవుని యొద్దకు ఆకర్షించుటకు లేఖనములు సరైన సాధనములని యేసు సెలవిచ్చాడు. యేసు యెషయా రచించిన పలుకులను ఉల్లేఖించి ఇలా చెప్పాడు:

> నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్య దినమున నేను వానిని లేపుదును. – వారందరును దేవునిచేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును, నా యొద్దకు వచ్చును (యోహాను 6:44, 45).[7]

దేవుని గూర్చి పరిశుద్ధ సత్య వేదములో వ్రాయబడి యున్నది తప్ప మనకు మరేమీయు తెలియదు.

"నీవు నీతిగలదానవై స్థాపింపబడుదువు" అని దేవుడు తన వాక్కులను కొనసాగించాడు (వచనం 14). దేవుని పట్టణము యొక్క గట్టి పునాది "నీతి"పై వేయబడియున్నది. "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" అని మనకు తెలిసినదే (రోమీయులకు 1:17ఎ; గలతీయులకు 3:11; హబక్కూకు 2:4 చూడము). నీతిమంతుని నమ్మకమంతా దేవునియందున్నది గనుక వాడు "అతనికి విరోధముగా గుంపుకూడినవారి" వలన కలుగు "బాధ"కైనను మరియు "భీతి"కైనను భయపడనక్కరలేదు (వచనాలు 14, 15).

సమస్తమును సార్వభౌముడైన దేవుని ఆధీనములో ఉన్నది. ఈ సత్యము 16 మరియు 17 వచనములలో పునఃరుద్ఘాటింపబడినది. వాస్తవమునకు మన నీతి ఆయన నీతిలో ఉన్నది. మనకు "నీతి" మరియు "స్వాస్థ్యము" యెహోవా వలన కలుగును. "యెహోవా సేవకులై" యుండుటలో గల వాస్తవము ఇదే.

యెషయా ప్రవచనము ఇంతవరకు "సేవకుడు"ని (ఏక వచనము) గూర్చి మాటలాడుచుండినది; కానీ ఇప్పటి నుండి, అది దేవుని ప్రజలైన "సేవకులు" (బహు వచనం) గూర్చి మాటలాడుచుండును. ఇది ఇరువురినీ అనగా, విమోచింపబడిన ఇశ్రాయేలీయులను[8] మరియు ఆధ్యాత్మిక ఇశ్రాయేలును, అనగా సంఘమును[9] సూచించును. మెస్సీయలో విశ్వసించి, ఆయన లోనికి బాప్తిస్మము పొంది, ఆయన బోధల ప్రకారము జీవించుచున్నవారు సంఘములో ఉన్నారని పౌలు చెప్పుచున్నాడు. " 'ఆయనయందు విశ్వాసముంచు వాడెవడును సిగ్గుపడడు' ... ఒక్క ప్రభువే అందరికి ప్రభువై యుండి, తనకు ప్రార్థన చేయువారందరి యెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు; ఎందుకనగా 'ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును' " అంటూ ఆయన క్రైస్తవులకు అభయము నిచ్చుచున్నాడు (రోమీయలకు 10:11–13). "అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప, మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవునుగాక, దానివలన నాకు లోకమును, లోకమునకు నేనును సిలువ వేయబడి యున్నాము. క్రొత్త సృష్టి పొందుట యే గాని. సున్నతి పొందుటయందేమియు లేదు, పొందకపోవుట యందేమియులేదు. ఈ

పద్ధతి చొప్పున నడుచుకొనువారికందరికి, అనగా దేవుని ఇశ్రాయేలునకు, సమాధానమును కృపయు కలుగును గాక" అని ఆయన గలతీయులకు వ్రాసాడు (గలతీయులకు 6:14-16).

సూచనలు

[1]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 444. [2]గలతీయులుకు 4:21-31లో దాసియైన మరియు స్వతంత్రురాలైన స్త్రీల రూపకాలంకారమును చూడుము. [3]"నిత్యమైన కృప" అను అర్థమిచ్చు *chesed 'olam* అను హెబ్రీ పదములు దేవుడు తన ప్రజల పట్ల కనుపర్చు చింత యొక్క భావమును సంక్షేపముగా తెలియజెప్పుచున్నవి (యెషయా 16:5 చూడము). [4]"The Steadfast Love of the Lord," *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [5]Hailey, 447. [6]See J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 449. [7]యిర్మీయా 31:33, 34 కూడ చూడుము. [8]యెషయా 63:17; 65:8, 9 కూడ చూడుము. [9]యెషయా 56:6; 65:13, 15 చూడుము. పౌలు రోమీయులకు 9:6లో క్రీస్తు ద్వారా విమోచింపబడినవారిని దేవుని "ఇశ్రాయేలు" వలె ప్రస్తావించుచున్నాడు.

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

### ❖❖❖ దేవుని సేవకుల స్వాస్థ్యము ❖❖❖
### (54వ అధ్యాయం)

దేవుని జనులలో గల నీతిమంతులు తెలిసికొను ఆశ్చర్యకరమైన విషయముల గూర్చిన ముందుచూపుతో 54వ అధ్యాయం ముందుకువెళ్లుచున్నది. మహిమాన్వితమును ఈడేర్చునదియునైన భవిష్యత్తు వారి ముందుండినది. ఈ ప్రవచనమును మనకు ఊపునిచ్చు ఆధారంగా ఉపయోగించుకొంటూ, "దేవుని యందు నమ్మకముంచువారి భవిష్యత్తు ఎలా ఉంటుంది?" అని మనము ప్రశ్నించవచ్చును. యెషయా ప్రవచనము మనకు ప్రోత్సాహకరమైన సమాధానము నిచ్చుచున్నది.

*రాబోవుచున్న మంచి విషయములనుబట్టి నీతిమంతులు జయగీతము పాడుచు ఆనందించవచ్చును.* దైవభక్తిగలవారికి ఆనందమయమైన భవిష్యత్తున్నది (వచనం 1). ప్రస్తుతకాలమందు సమృద్ధి యనునది మనదై యుండకపోవచ్చును, కానీ మనము ఏదో ఒక రోజున మనకు అనుగ్రహింపబడిన దానితో అమితాశ్చర్యము నొందుదుము. మనము, గొడ్డుబోతుతనముగలవారమైన మనము, లెక్కలేనంత మంది పిల్లలను కలిగియుందుము. ఆశ్చర్యమైనవియు, అసంఖ్యాకమైనవియునైన ఆశీర్వాదములు మన కొరకు వేచియున్నవి!

*అదనంగా, విశ్వసనీయులైనవారు ఎదుగుదల కొరకు ఎదురుచూడవచ్చును.* దేవునితో నడుచువాడు తన జీవితము, హృదయము, ఆత్మ ఆలోచనా ధోరణి, మరియు సహవాసములో విస్తారంగా వర్ధిల్లును. వాడు దేవుని ఎరుగుటకు అంతకంతకు అధికమగుచుండు లోతుల్లోనికి వెళ్లుచుండును. వాడు మొదట దేవునిని కనుగొంటాడు, ఆ తరువాత లోతైన విషయాలలోనికి

వెళ్తాడు. ఈ విస్తరణ మనము దాని కొరకు సిద్ధపడునట్లు ఇక్కడ ఇవ్వబడిన ఆహ్వానమును మనము కనుగొనునంత కచ్చితమైనదై యున్నది (వచనాలు 2, 3). విశ్వాసము మరియు దేవునితో నడుచు శ్రద్ధతో కూడిన నడకనుబట్టి కలుగు విస్తృతపరచు ప్రతిఫలములను యెషయా, రూపకాలంకార భాషలో ప్రవచించాడు.

*ఇంతేగాక, విధేయులు వారి విశ్వాసముతో కూడిన ధైర్యంతో విశ్రాంతిగా సేదదీర్చుకొనవచ్చును.* మనము ఏ విషయములోనైనా భయపడుటకు ఎటువంటి కారణమూ లేదు. రేపేమి సంభవించునో మనకు ఏమియు తెలియకపోవచ్చును, కానీ రేపటి దినము విశ్వాసికి అవమానము కలుగజేయదని మనకు తెలియును. ఊరడింపు కలుగజేయు మాటలతో, యెషయా ఇలా చెప్పుచున్నాడు: "భయపడకుము, నీవు సిగ్గుపడనక్కరలేదు" (వచనం 4ఎ). జీవితంలో మనము ఒంటరివారమై కాలము గడుపునట్లు దేవుడు మనలను విడిచిపెట్టడు. దేవుని వాగ్దానములు ఎన్నటికినీ నెరవేరని వట్టి మాటలే అని మనమెన్నడునూ చూడము.

*దేవుని వెంబడించువారు కృప వెంబడి కృపను పొందుకొనుటకు ఆశించవచ్చును.* ఆయన మనలను తన కృప ద్వారా విమోచించాడు, గనుక మనము తన కృప ద్వారానే ఆయన గృహము చేరునట్లు తగు శ్రద్ధ వహించును. "... నా కృప నిన్ను విడిచిపోదు, సమాధాన విషయమైన నా నిబంధన తొలగిపోదు ..." అని ఆయన మాట ఇచ్చియున్నాడు (వచనం 10). దేవుడు అకస్మాత్తుగా మారిపోతాడా? ఒక రోజున మనము నిద్ర లేచి ఆయనయందు నమ్మకముంచువారి యెడల ఆయన ఉగ్రత చూపించు దేవుడైయున్నాడని కనుగొంటామా? నిశ్చయంగా ఇలా ఎన్నటికీ జరుగదు! నిత్యుడైన దేవుడు ప్రేమామయుడైన దేవుడై యున్నాడు – ఆయన ఎల్లప్పుడు ప్రేమామయుడైన దేవుడు అయి యుండినాడు, ... , అయి యున్నాడు, ... , అయి యుంటాడు! హల్లేలూయ!

*ఏదిఏమైనా, ఆయనతో కూడ నడువవలెనంటే క్రమశిక్షణ కావలెను.* ఆయన ఇశ్రాయేలును కష్టాల ద్వారా క్రమశిక్షణలో పెట్టాడు; అవసరమైనప్పుడెల్లా, మన యెడల కూడ అలాగే ప్రవర్తిస్తాడు. ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షిస్తాడు, గద్దిస్తాడు కూడ (హెబ్రీయులకు 12:6 చూడము). ఇశ్రాయేలును గూర్చి, ఆయన ఇలా సెలవిచ్చాడు, "నిమిషమాత్రము నేను నిన్ను విసర్జించితిని, గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చెదను. మహోద్రేకము కలిగి నిమిషమాత్రము నీకు విముఖుడనైతిని, నిత్యమైన కృపతో నీకు వాత్సల్యము చూపుదును" (యెషయా 54:7, 8).

*మనము ఎన్నడైనను ఎరుగని సమృద్ధి మరియు సంపూర్ణతతో, దేవుని వాగ్దానములు వెల్లడియగుట మనము చూచెదము.* ప్రతి మాట, ప్రతి ధ్రువీకరణము, మరియు ప్రతి ఎదురుచూపు మనము ఊహింపలేనంతగా ఎంతో చక్కని రీతులలో సఫలీకృతమగును (వచనాలు 11, 12 చూడుము). మనము ఆయన సింహాసనము యొద్దకు పదిలంగా చేరుకొనునంత వరకు దేవుడు మనలను మన శత్రువుల బారి నుండి మరియు సకల ఆపదల నుండి కాపాడునని మనము ఆయన కాపుదలను నమ్ముకొనవచ్చును (వచనాల 14, 17). దేవుని సేవకుల స్వాస్థ్యము ఇదే (వచనం 17); న్యాయ విమర్శలో ఆయన తన వారిని నిర్దోషులనుగా తీర్చును.

ఇది దేవుని సేవకుడు కలిగియున్న ఎంత గొప్ప భాగ్యముతో కూడిన స్వాస్థ్యమై

యున్నది కదా! ఈ సేవకుడు ఇప్పటి నుంచే తన గళమెత్తి విజయ గీతకలు పాడుకొనునంతటి నిశ్చయమును మహిమాన్వితమునైన భవిష్యత్తు కలిగియున్నాడు. అతడు దేవుని స్వారూప్యములోనికి ఎదుగును. వికాసము మరియు విస్తరణ మున్ముందు రోజుల్లో రాబోవుచున్నవి. దేవుని వాక్యము యథార్థమైనది గనుక అతడు విశ్వాసముతో విశ్రాంతిగా సేద దీర్చుకొనవచ్చును. అతడు దేవుని కృపలను ఒకదాని వెంట మరొక దానిని పొందుకొనుచుండును. క్రమశిక్షణ అతని జీవితములో ఒక భాగమై యున్నప్పటికిని, అది ద్వేషముతో కూడినదిగాక, ప్రేమపూర్వకమైనదై యుండును. దేవుని వాగ్దానములు ఆయన యెడల సమృద్ధిగానెరవేరుచుండును మరియు ఆయన కాపుదల అతనికి సంపూర్ణముగా అనుగ్రహింపబడుచుండును. వీటన్నిటినీ ఒక చోట చేర్చినట్లయితే, అది ప్రస్తుతమందలి సమృద్ధియైన జీవితమునకును భవిష్యత్తులో నిత్య జీవమునకును సమానమైనదై యుండును.